

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న పూజారులు

## శ్రీ మహాలింగమయ్య విగ్రహ ప్రతిష్ఠాపన

కమలాపూర్, డిసెంబర్ 7 : మండలంలోని ఉప్పలపల్లి గ్రామంలో శ్రీ మహాలింగమ య్య విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ పూసాల ప్రకాశం గురువారం తెలిపారు. శ్రీ మహాలింగమయ్య విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగం, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనతో పాటు 108 శివలింగాలను ప్రతిష్ఠాపన చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో మహాలింగమయ్యను దర్శించుకుని కట్న కానుకలు అందజేశారు. ఉప్పల్, ఉప్పలపల్లి గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు

### పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

వరంగల్,డిసెంబర్ 7 : తెలంగాణ ప్రజల ఆశీస్సులతో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వాని పద్మశాలీ ఉద్యోగుల రాష్ట్ర సంఘం శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తిరందాస్ యాదగిరి, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే రవి ప్రకాశ్, మార్గం ధర్మదేవ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని ఆకాంక్షించారు. పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే దిశలో ఆలోచనలు చేయాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, నూతన పీఆర్సీ సత్వరమే అమలు చేయాలని కోరారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి ఉద్యోగుల సమస్యను పరిష్కరించే దిశలో నూతన ప్రభుత్వం అడుగులు వేయాలని వారు కోరారు.

### టీఎన్జీవో నేతలు..

హనుమకొండ, డిసెంబర్ 7: తెలంగాణ నూతన ప్రభుత్వానికి హనుమకొండ జిల్లా టీఎన్జీవో నేతలు అభినందనలు తెలిపారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలోని టీఎన్జీవో భవన్‌లో హనుమకొండ జిల్లా టీఎన్జీవో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వంతో కలిసి పని చేయడంలో ఉద్యోగులుగా ముందుంటామని పేర్కొన్నారు. జిల్లా మంత్రులు ధనసరి అనసూయ (సీతక్క), కొండా సురేఖ, శాసనసభ్యులకు హనుమకొండ జిల్లా టీఎన్జీవో యూనియన్ పక్షాన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు వేణు గోపాల్, కోశాధికారి రాజేశ్, కేంద్ర సంఘం నాయకులు శనిగరపు శ్యామ్ సుందర్, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు సలీం, రాజమౌళి, రాజేశ్ ఖన్నా, రాజేశ్వర్ రెడ్డి, రాజీవ్, షైది రాజు, శ్రీనివాస్, శివ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## 9, 10న రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 7 : ఈ నెల 9, 10 తేదీల్లో వరంగల్ మున్సిపాలిటీ ఇండోర్ స్టేడియంలో హనుమకొండ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ హనుమకొండ అధ్యక్ష, కార్యదర్శులు బండారి సంతోష్, ఎస్ తిరుపతి తెలిపారు. ఈ మేరకు గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా చేతులమీదుగా బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర కిక్‌బాక్సింగ్ ప్రెసిడెంట్ సీ రామాంజనేయులు, జనరల్ సెక్రటరీ ఎం మహిపాల్, ట్రెజరర్ పీ శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో 25 జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని వారు తెలిపారు.

## పర్వతగిరిలో కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ

పర్వతగిరి, డిసెంబర్ 7: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండలకేంద్రంలో గురువారం కాంగ్రెస్ నాయకులు అభిమానులు స్వీట్లు పంచి, పటాకులు పేల్చి సంబురాలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ తీశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ పథకాలు లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, ఎంపీటీసీలు బొట్ల మహేంద్ర, లావుడియా సరోజన, సొసైటీ డైరెక్టర్లు జూలపెల్లి గంగాధర్‌రావు, కిష్టయ్య పాల్గొన్నారు.

## 10న ఎన్ఎంఎంఎస్ పరీక్ష..

హనుమకొండ సిటీ, డిసెంబర్ 7: ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఈ నెల 10వ తేదీన ఉదయం 9.30 నుంచి 12.30 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ హై గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పరకాలతో పాటు హనుమకొండలో ఏర్పాటు చేసిన 4 పరీక్షా కేంద్రాల్లో 628 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

# మత్తు పదార్థాలను అరికట్టేందుకు కృషి చేయాలి

### కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, డిసెంబర్ 7: సమాజ ప్రగతికి అడ్డంకిగా మారుతున్న మత్తు పదార్థాల వినియోగం అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలనపై ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక (జాయింట్ యాక్షన్ ప్లాన్ ఆఫ్ డ్రగ్స్ అండ్ సబ్ స్టాన్సెస్ అబ్యూస్ ఎమాంగ్ చిల్డ్రన్ అండ్ ఇలిసిట్ ట్రాఫికింగ్)పై మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సమన్వయంతో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో డీఆర్‌వో, నోడల్ అధికారి వైవీ గణేశ్ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమాధికారి కే మధురిమ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం అనేది సమాజానికి ముప్పు అన్నారు. ఎంతో భవిష్యత్ కలిగిన విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి భావిజీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పరిసర ప్రాంతాలపై సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. పాఠశాలలో ప్రహరీ క్లబ్బులు ఏర్పాటు చేసి, బాలల రక్షణ, సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా పాఠశాలకు 100 మీటర్ల దూరంలో బెల్ట్ షాపులు లేకుండా, పిల్లలకు మత్తు పదార్థాల వినియోగానికి చోటు కల్పించే చిన్న చిన్న దుకాణాలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు డ్రగ్స్, దానిని అరికట్టే చర్యలు, వాటికి సంబంధించిన వివిధ అంశాలను ఈ సందర్భంగా వివరించారు. మత్తు పదార్థాలు, వాటి వాడకంతో కలిగే అనర్థాలు, వాటిని వినియోగించే వారి ప్రవర్తన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మత్తు పదార్థాల వాడకంతో వచ్చే శారీరక, మానసిక స్థితిగతులపై సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉదహరించారు. ఈ కార్యక్రమంలో డీపీవో జగదీశ్వర్, డీఎంహెచ్‌వో బీ సాంబశివరావు, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి చంద్రశేఖర్, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జన్ను కిరణ్‌కుమార్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్ ప్రవీణ్ కుమార్, టీ న్యాబ్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, సీఎంవో రాధ, సీడబ్ల్యూసీ సభ్యుడు కే దామోదర్, ఎస్ రాజేంద్రప్రసాద్, పీ హైమావతి, గురుకులాల ఆర్సీలు పాల్గొన్నారు.

# పరిశోధనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 7: సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశోధనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. గురువారం నిట్ అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో సదస్సు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీప్ ఓషన్ మిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అండ్ నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ రమణమూర్తి, ఇండియన్ సొసైటీ ఆఫ్ థియోరెటికల్ అండ్ అప్లైయిడ్ మెకానిక్స్ (ఐఎస్‌టీఏఎం) ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఐఎస్ శివకుమార, సెక్రటరీ ప్రొఫెసర్ దీపక్ కుమార్ మైతీ, ప్రొఫెసర్ బ్రెట్నిస్లీ జోజెఫ్, స్లోవేకియా, ప్రొఫెసర్ డేవిడ్ లారోజ్, చిలీ, నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి ప్రారంభోత్సవానికి అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ ఎంవీ రమణమూర్తి తన ప్రారంభ ప్రసంగంలో ప్రపంచవ్యాప్తంగా నీరు, ఆహారం, ఇంధన భద్రతలో వాతావరణ మార్పుల సవాళ్లపై ప్రసంగించారు. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి ఐఎస్‌టీఏఎం 68వ కాంగ్రెస్‌కు ప్రతినిధులందరికీ స్వాగతం పలికారు. సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, ఫలవంతమైన విద్యాపరమైన చర్చ కోసం చూస్తున్నామన్నారు. ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఐఎస్ శివకుమార మాట్లాడుతూ దేశంలో అనువర్తిత మెకానిక్స్‌లో ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలపై ప్రత్యేక దృష్టి సారించి, సైన్స్, ఇంజినీరింగ్‌లో పరిశోధనలను పెంపొందించడానికి సైంటిఫిక్ కమ్యూనిటీకి చెందిన నాయకులు ఐఎస్‌టీఏఎం సొసైటీని స్థాపించారని, ఇది 68వ సదస్సు అని తెలిపారు. 210 మందికి పైగా అధ్యాపకులు, పరిశోధనా పండితులు ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. రాబోయే మూడు రోజుల్లో తమ పరిశోధనా పత్రాలను ప్రదర్శించనున్నారు.

## దూరవిద్య పీజీ పరీక్షల పరిశీలన

హనుమకొండ చౌరస్తా: కాకతీయ విశ్వవిద్యాలయ దూరవిద్య పీజీ పరీక్షల నిర్వహణ తీరుతెన్నులను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రమేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా గురువారం లాల్ బహదూర్ కాలేజీలో నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.

## విజయవంతం చేయండి

న్యూశాయంపేట, డిసెంబర్ 7 : వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 10న కార్తీక మాసం పురస్కరించుకొని నిర్వహించే కార్తీక వనభోజన కార్యక్రమాన్ని వెలమ బంధుమిత్రులు విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మధుసూదన్‌రావు, ప్రవీణ్‌కుమార్ కోరారు. జిల్లాలోని వెలమ కుల బంధువులు ఆదివారం ఉదయం 10 గంటలకు పాల్గొనాలని కోరారు.



భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన

## గ్యాస్ గ్యారెంటీ కోసం బారులు తీరిన మహిళలు

వరంగల్, డిసెంబర్ 7 : గ్యాస్ ఏజెన్సీల వద్ద మహిళలు బారులు తీరారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన గ్యాస్ గ్యారెంటీ కోసం మహిళలు బారులు తీరారు. రూ. 500లకే గ్యాస్ సిలెండర్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో గ్యాస్ సిలెండర్ కోసం ఆధార్ కార్డులతో మహిళలు పెద్ద ఎత్తున గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరారు. ఆధార్ కార్డులతో కెవైసీ ఇచ్చేందుకు పెద్ద ఎత్తున మహిళలు వచ్చారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో వరంగల్‌లోని భారత్‌గ్యాస్ ఏజెన్సీ వద్ద మహిళలు బారులు తీరి ఉడడం కనిపించింది.

# వరంగల్ తూర్పునకు మూడో సారి మంత్రి పదవి


### కాంగ్రెస్ హయాంలోనే మంత్రి హోదాలు

వరంగల్, డిసెంబర్ 7 : వరంగల్ తూర్పు నియోజవర్గానికి ముచ్చటగా మూడోసారి మంత్రి పదవి దక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వాల్లోనే వరంగల్‌కు మంత్రి పదవులు దక్కాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరంగల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన తక్కళ్లపల్లి పురుషోత్తంరావుకు అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి ప్రభుత్వంలో 1993 నుంచి 94 పదకొండు నెలల పాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా పని చేశారు. తర్వాత 2011 నుంచి 14 వరకు వరంగల్ తూర్పు నియోజవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన బస్వరాజు సారయ్య అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో రెండున్నరేళ్ల పాటు బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. అప్పటి నుంచి రెండు పర్యాయాలు ప్రభుత్వాలు వచ్చినప్పటికీ తూర్పు నియోజవర్గానికి మంత్రివర్గంలో చోటు దక్కలేదు. ప్రస్తుతం నూతనంగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొలువుదీరిన ప్రభుత్వంలో వరంగల్ తూర్పు నియోజవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండా సురేఖ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో వరంగల్ ప్రాంతానికి ముచ్చటగా మూడోసారి మంత్రి పదవి దక్కిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అకాల వర్షంతో నష్టం..

### ● నేల వాలిన వరి పంట ● తడిసిన ధాన్యం

పర్వతగిరి, డిసెంబర్ 7: మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షంతో అన్నదాతకు నష్టం వాటిల్లిం ది. పలు గ్రామాల్లో చేతికందే దశలో ఉన్న వరి పంట అకాల వర్షంతో పంట నేలవాలింది. రైతులు ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాల వద్దకు తీసు కువచ్చిన క్రమంలో అకాల వర్షంతో వరి ధాన్యం తడిసిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



తురుకల సోమారంలో అకాల వర్షంతో నేలవాలిన వరి పంట